# అసామాన్యం

వి. రాజారామమోహనరావు



ముందు ఆ వుద్దేశం లేదు లక్ష్మికి. కానీ ఆ కాలనీకి వెళ్ళాక, అక్కడ స్థిర పడ్డాక జీవితం ఆ పద్ధతిలోనే బావుందని పించింది.

సిటీ బైట కొత్తగా తయారైన కాలనీ అది. నగరం మధ్యకి రావాలంటే అక్కడ్నించి పన్నెండు కిలోమీటర్ల ప్రయాణం చెయ్యాలి.

సిటీకి దగ్గరగా అప్పటిదాకా వున్న యిల్లు ఖాళీ చెయ్యమన్నారు. అదే పరిసరాల్లో ఒంటరి గదైనా తనకి అందుబాట్లో వుండే అద్దెలో దొరకలేదు లక్ష్మికి. ఇంటికోసం వెతికివెతికి చివరికి నగరం పొలిమేరలకి మారటానికి నిశ్చయించుకుంది.

ఒక్కటే గది. యాభై రూపాయల అద్దె. సిటీకి వెళ్ళి రావటానికి మరో యాభై. ఆర్థికంగా యిదివరకటి కన్నా

బావుంది. ఇంటివాళ్ళ బాదరబందీ కూడా పెద్దగా లేదు. భార్యాభర్తా వాళ్ళకో బాబు.... ఎటొచ్చీ ఒక్కటే యిబ్బంది యింటాయన వెంకట్రావు.... అతని చూపులు... అదే కొంచం యిబ్బందిగా వున్నాయి లక్ష్మికి.

తన వొంటరి జీవితంలో లక్ష్మి యిలాంటి చాలాయిబ్బందులు ఎదుర్కొంది ఒక్క మగాడి చూపులు ఎదుర్కొలేనంత బేలతనంలో లేదు లక్ష్మిజీవితం. పోతే వెంకట్రావు చూపుల పరిభాష అర్థంకాకే లక్ష్మి పడుతున్న యిబ్బందంతా. ఆ చూపుల్లో వున్నది కేవలం ఆకలో, కోరికో. అమాయకత్వమో, కరుకుతనమో, బాహాటంగా బైటపడలేని మధ్యతరగతి మర్యాదస్తుడి పిరికితనమో అయితే లక్ష్మికి మానసికంగా అంత యిబ్బంది వుండేది కాదు. యివన్నీ కలిసిన కలగలపు, దాన్ని మించిన గందరగోళం ఆ చూపుల్లో వుండటంతో కొత్తలో కొన్నాళ్ళు చాలా యిబ్బంది పడింది లక్ష్మి. ఆ తర్వాత నెమ్మది నెమ్మదిగా వెంకట్రావుని, అతని చూపుల్ని తప్పించుకు తిరగటం అలవాటు చేసుకుంది.

వెంకట్రావు ఎంత యిబ్బంది అయినా, అతని భార్య రుక్మిణి దగ్గర అంతకు మించిన హాయిగా వుంది లక్ష్మికి. ఆప్యాయంగా పలకరింపు.... అన్నింటికీ మాట సాయం, చిన్నా పెద్దా పనులకి చేదోడు, వాదోడుగా వుండటం.... చాలా ఏళ్ళుగా తన జీవితానికి కరువైన తృప్తి లభించినట్టుంది రుక్మిణి రూపంలో లక్ష్మికి. చుట్టూ మనుషులున్నా మానసిక ఎడారిలో కాకుండా మరో మనిషి పొరుగున వున్నట్టుంది.

ఓ రకంగా లక్ష్మిలో ఆ వుద్దేశానికి అప్పటి ఆ జీవితానికి ప్రత్యక్షంగా ఆ కాలనీ కారణం అయితే పరోక్షంగా రుక్మిణి కారణం. ఇదివరకటి కన్నా మెరుగ్గా వుంది లక్ష్మికి ఆ జీవితం. ఏ గొడవా గోలా లేని లక్ష్మి తమింట్లో అద్దెకుండటం రుక్మిణికీ బాగానే వుంది. కానీ బాగాలేనిదల్లా వెంకట్రావుకే.

* * *

లక్ష్మి కళ్ళబడ్డప్పుడల్లా అలజడిగా వుంటోంది వెంకట్రావుకి. లక్ష్మి వొంటరిది అని స్ఫురించినప్పుడల్లా ఆ అలజడి స్థాయి మరింత పెరుగుతోంది.

కొన్ని పదార్థాలు గొంతుకి అడ్డు పడతాయి. అలాగే కొన్ని వూహలు, కోరికలు మనసుకి అడ్డుపడతాయి. ఆ అడ్డు తొలిగేవరకు త్రిశంకుస్వర్గంలా నానా బాధగా వుంటుంది. వెంకట్రావుకి లక్ష్మి సంగతి అలాగే తయారైంది

లక్ష్మి విషయమే కాదు. జీవితంలో చాలా విషయాల్లో యిలాంటి బాధకి గురైయ్యాడు వెంకట్రావు. అందుకని యీ రకం జంజాటపు విషయాల్లో తేట

తెల్లంగా వుండటమే తనకి మంచిదని అనుభవంతో నేర్చుకున్నాడు.

కొన్నాళ్ళక్రితం కొలీగ్స్ వారానికి ఒకటి రెండుసార్లు డ్రింక్స్‌కి పట్టుకెళ్ళే వారు. అక్కడ అదనపు కబుర్లు, హంషారు, తూలుకుంటూ చిరుమత్తుగా యింటికి రావటం బాగానే వుండేది. కానీ కొన్నాళ్ళకి జీతం, బడ్జెట్ విపరీతంగా దెబ్బతింటం మొదలెట్టాయి అప్పులు చెయ్యాల్సి వచ్చింది. పరిస్థితి గమనించి అందుకే అలాంటి పార్టీలకి వెళ్ళటం మానేశాడు. రమ్మనమని బలవంతంచేసే కొలీగ్స్‌కి స్పష్టంగా తన ఆర్థిక యిబ్బంది చెపుతూవచ్చాడు. మరి కొన్నాళ్ళకి వాళ్ళూ పిలవటం మానేశారు. అలాగే నెలలో ప్రతి మొదటి ఆదివారం ఆడే పేకాటకి స్వస్తి చెప్పాడు. ఇంక ఆడవాళ్ళ గొడవ అసలు పెట్టుకోలేదు.

స్నేహితుల బలవంతం అనీ, నలుగురితో కలిసుండాలనీ నెలకోసారి సరదాలే అనీ....యిలా సరిపుచ్చుకోటం కన్నా తన అసలు పరిస్థితిని కప్పిపుచ్చుకుని నలుగురిలో లేని గొప్పకి, షోకుకి వెళ్ళి ఆ తర్వాత నానా గందరగోళంలో చిక్కుకోటం కన్నా యిలా స్పష్టంగా తనేమిటో దాపరికం లేకుండా బతకటమే సవ్యంగావుందనిపించింది వెంకట్రావుకి.

యిదమిత్థంగా అలా తేల్చుకుని పాత గొడవల్లోంచి బైటపడటానికి పట్టిన కాలం అంతా అలజడిగానే గడిచింది వెంకట్రావుకి.

రుక్మిణి, యిల్లు, సంసారం విషయంలో అసంతృప్తేం లేదు వెంకట్రావుకి. అనవసరంగా లేని బాధలు కొనితెచ్చుకోటం అతని కిష్టంలేదు. ఆఫీసు. యిల్లు నెలకి వో సినిమా ఏడాదికి ఒకటి రెండు పండగిలు... యీ రకంగా అయితేనే సంసారం యిబ్బందిలేకుండా గడుస్తుందని తెలుసు అందుకని అలాగే వుంటున్నాడు.

వెంకట్రావు నిర్ణయించుకున్నంత నియమబద్ధంగా బైట జీవితమంతా లేదు. ఏ స్థాయికి ఆ స్థాయిలో ఎటువంటి మనిషినేనా కబళించేసే సరదాలు, వ్యసనాలు వున్న జీవితం వుంది అప్పుడప్పుడు వో అడుగు అటూ యిటూ వేస్తున్నా చాలావరకు తనని తను కంట్రోల్ చేసుకుంటూనే వున్నాడు.

యిష్టంగానో, అయిష్టంగానో .... పరిస్థితుల వొత్తిడివల్లో ఎవరేనా వో విలువని పాటిస్తే ... ఆ విలువ తనకే కాదు. పదిమందికీ కూడా మంచిదే అని ప్రతిపాదించుకోటంలో తృప్తి వుంటుంది. వెంకట్రావు పరిస్థితి అలాగే వుంది. ద్వంద ప్రవృత్తి అతనికి సుఖంగా లేదు. అందుకని నిర్ద్వందంగా, తేటతెల్లంగా వుండటం మంచి జీవితపు విలువనిపించింది. సాంఘికపరంగా కూడా అది నిజమే కాబట్టి అతనికి మరింత

బావుంది. కానీ అన్ని విషయాల్లోనూ, అన్ని పరిస్థితుల్లోనూ అలా వుండలేక పోవటంలోనే చిక్కు తలెత్తేది. యిప్పుడు లక్ష్మి విషయం అదే చిక్కు తెచ్చిపెట్టింది వెంకట్రావుకి.

లక్ష్మి కనిపించినప్పుడల్లా ఆకర్షణ... ఆమెని వూహించుకున్నప్పుడల్లా కోరిక... గిరిగీసుకున్న జీవితంలోంచి బైటకి రావాలన్న ఆరాటం.... యివన్నీ కలిసి యిబ్బంది పెడుతున్నాయి వెంకట్రావుని.

రుక్మిణి కన్నా లక్ష్మి అందమైంది అవటమే కాదు. పెళ్ళికాక ముందు తన జీవితంలోకి ప్రవేశించే ఆడదానికి వుండాలి అని వెంకట్రావు వూహించు కున్న శరీరసౌష్టవం పరిపూర్ణంగా లక్ష్మికి వుండటం మరింత అలజడిగా వుంది వెంకట్రావుకి.


చూడకూడదనుకుంటూనే ఆమె వేపు చూట్టం.... వూహల్లోకి రానివ్వకూడదను కుంటూనే లక్ష్మి గురించి వూహించటం... చాలా యిబ్బందిగా ఆరాటంగా వుంది వెంకట్రావుకి. ఏం చెయ్యాలో తోచటం లేదు. తనంతట తను ఏర్పాటుచేసుకున్న పునాది కదిలిపోతున్నట్టుంది.

యింటి పెత్తనం చాలావరకు రుక్మిణిదే. అంతకీ ఒకటికి రెండుసార్లు భార్యకి చెప్పి చూశాడు వెంకట్రావు. "ఒంటరి ఆడది.... అవిడ మన యింట్లో ఎందుకు చెప్పు.... పంపించెయ్యి ఎవరేనా భార్యాభర్తల్ని చూద్దాం...." అని.

"భలేవారే.... ఒంటరిదైతే నేమండి... గొడవాగోలాలేదు.... పైగా లక్ష్మి చాలా మంచిది.... మన పొరుగు కావాలని పడి చచ్చేరకం... ఆమె అంతట ఆమె వెళ్ళే వరకు మన మనసులో వేరే ఆలోచనే అనవసరం...." అంది రుక్మిణి.

రుక్మిణి లక్ష్మిని అంతగా అభిమానించ టానికి చాలావరకు లక్ష్మి ప్రవర్తనే కారణం. రోజూ కనీసం వో గంటేనా రుక్మిణితో కబుర్లు చెపుతుంది. తీరిక వున్నంతసేపూ వాళ్ళ బాబుని ఆడిస్తుంది. ఏదేనా రోజు యింటికి రావటం ఆలశ్యం అయితే ఆరోజు చేసిన వోవర్ టైముకి ఎంత డబ్బొచ్చేది చెపుతుంది...రాబోయే పండగకి ఎలాంటి ఏ రంగు చీర కొనుక్కోవాలనుకుంటోందో చెపుతుంది. తనకి రుక్మిణిని మించిన ఆత్మీయులు, దగ్గరవాళ్ళు ఎవరూలేరన్నట్లు ప్రవర్తించే లక్ష్మిని రుక్మిణి కూడా దూరంగా చూడలేకపోతోంది.

రుక్మిణికి చెప్పి ఆమె ద్వారా లక్ష్మిని యిల్లు ఖాళీచేయించటం జరిగే పని కాదని వెంకట్రావుకి స్పష్టంగా అర్థమైంది. తనంతగా తను లక్ష్మిని యిల్లు ఖాళీ చెయ్యమని చెప్పే అవకాశంలేదు. తెగించి భార్యముందు బైటపడి లక్ష్మివల్ల తనలో రేకెత్తుతున్న కోరికలు, అలజడి చెప్ప లేడు. పరిస్థితి, మనస్థితి యిరకాటంగా వున్నాయి. లక్ష్మి అతన్నెలా తప్పించుకు




గడుపుతోందో, వెంకట్రావు అలాగే లక్ష్మిని తప్పించుకుంటూ గడుపుతున్నాడు.

అయినా లక్ష్మిగొంతు వినిపించినా, ఆమె పక్కగదిలో మెసులుతున్న చప్పుడు వినిపించినా యిబ్బంది తప్పటం లేదు వెంకట్రావుకి.

వెంకట్రావు మనిషి కనిపించకపోయినా, అతని అలికిడి వినిపించినప్పుడల్లా .... ఆ చూపులు కళ్ళముందు లక్ష్మికీ మెదులుతూనే వున్నాయి.

* * *

వెంకట్రావు వూహించని విషయం అది. అన్నేరకాలుగా సిటీలో అదో పెద్ద సెంటరే అయినా తన ఆఫీసు ఆవేపు నుంచి కొత్తగా కట్టిన బిల్డింగ్‌లోకి సిటీ మరోవేపుకి మారటంవల్ల గడిచిన తొమ్మిది పదినెలలుగా ఆవేపు రాలేదు వెంకట్రావు. రెండురోజులు ఆఫీసు సెలవ అవటంవల్ల, ఎప్పట్నుంచో అనుకుంటున్న పని ఒకటి పూర్తిచేద్దామనుకోటంతో అక్కడికి వచ్చాడు.

మంచి షాపింగ్ ప్లేస్... వచ్చేజనం.. వెళ్ళేజనం.... వరసగా వున్న షాపుల ముందున్న వాకింగ్ ప్లేస్‌లో లక్ష్మి కనిపించింది వెంకట్రావుకి. వో పక్కగా నిలబడివుంది. అవునా కాదా అని వెంకట్రావు పరికించి చూస్తుండగానే యిద్దరు ఆడవాళ్ళు వచ్చి లక్ష్మిదగ్గర నిలబడ్డారు. నవ్వుతూ మాట్లాడారు. లక్ష్మి మాట్లాడింది.

అలా మాట్లాడిన ఆ ఆడాళ్ళ వెంకట్రావుకి తెలుసు. అంతకు ముందు ఆ చోటు....పొద్దుట్నుంచీ సాయంత్రం వరకూ అక్కడ తిరిగే ఆ ఆడాళ్ళు వెంకట్రావుకి పరిచయమే. అతనికి

వాళ్ళతో అనుభవం లేకపోయినా, వాళ్ళ వృత్తి .. పద్ధతి అన్నీ తెలుసు.

వాళ్ళెవరో తెలియక లక్ష్మి వాళ్ళతో మాట్లాడుతుందేమో .... అనుకున్నాడు వెంకట్రావు.

వెంకట్రావు చూస్తుండగానే వాళ్ళు ఎదురుగా ఎవర్నో చూసి తలూపారు.

తెలియక లక్ష్మి వాళ్ళ వలలో చిక్కుకుంటోందేమో అన్న అనుమానంతో గబగబా అటు నడిచాడు వెంకట్రావు.

రోడ్డుదాటి లక్ష్మిదగ్గరగా వెళ్ళేటప్పటికి ఆమెపక్కనే మరో మగాడున్నాడు.

అతనితో కలిసి ఆటో ఎక్కుతోంది.

అంతకీ...."లక్ష్మీ..." అని పిలిచాడు వెంకట్రావు.

ఓ కాలు ఆటోలో వేసి పిలుపుకి వెనక్కి తిరిగింది...ఆటో కదులుతోంది.

"మీరా .." అన్నట్టు ఆశ్చర్యంగా చూసింది లక్ష్మి....

తలతిరిగినంత పనైంది వెంకట్రావుకి. పూర్తిగా అనూహ్యమైన విషయం. కదలిక మరిచిపోయినవాడిలా కాస్సేపుఅలాగే నిలబడిపోయాడు.

"ఎందుకంత బెంగ....మళ్ళీగంటలో వస్తదిలెండి లక్ష్మి...." అంది అక్కడే ఉన్న యిందాకటి యిద్దరిలో వొకామె నవ్వుతూ.

మనసులో ఎక్కడో అట్టడుగున తారట్లాడుతున్న కొంచెం సందేహం అలా అనగానే తీరిపోయింది వెంకట్రావుకి. యింక అక్కడ వుండలేక వచ్చేశాడు వెంకట్రావు.


లక్ష్మి ఏం తెలియని పసిపిల్లనిగానీ, కన్నెపిల్లనిగానీ వెంకట్రావు ఎప్పుడూ అనుకోలేదు. కానీ మరీ యింత యిలా వొంటివ్యాపారం చేసేమనిషనీ అనుకోలేదు.

అదేస్థలంలో అలా అటూ యిటూ తిరిగే ఆడాళ్ళని చాలారోజుల క్రితమే వెంకట్రావు చూశాడు. కుతూహలంకొద్దీ వాకబుచేస్తే వాళ్ళ పద్ధతి తెలిసింది.

కొత్తగా చూసేవాళ్ళకి వీళ్ళు వొళ్ళమ్ముకునే ఆడాళ్ళలా కనపడరు. ఏ పొరుగూరునుంచి వచ్చిన వాళ్ళలానో వుంటారు. వీళ్ళు సాధారణంగా చేసేది పగటివ్యాపారమే. ఎంచుకున్న వ్యక్తి రమ్మంటే అతను తీసికెళ్ళినచోటుకి వెడతారు. ఆ వీలు లేకపోతే తమకి తెలిసున్న వాళ్ళున్నారని వాళ్ళే ఏదోయింటికి తీసికెడతారు.

దిక్కూ-మొక్కూ లేక తలదాచుకోటానికి యింత గూడుమాత్రం వున్న కొంతమంది ముసలాళ్ళు వీళ్ళకి వాడుక. గంటా, రెండుగంటలు చోటిచ్చినందుకు వాళ్ళ కివ్వాల్సింది వాళ్ళకి యిచ్చేస్తారు.

మధ్యవుండి తార్చేవాళ్ళ బెడద .... రాత్రిళ్ళు తెలియనిచోట్లకి వెళ్ళి పడే యిబ్బందులు కొంతవరకేనా తప్పించుకునేందుకు వాళ్ళు ఎన్నుకున్న మార్గం యిది. పోతే పెద్దబాధ అల్లా బాహటంగా




పట్టపగలు తమని తాను రోడ్డుమీద నిలబెట్టుకోవాలి

కోపం, అసహనం, బాధ.. .యిదివరకటికన్నా లక్ష్మిమీద పెరిగిన కోరిక అన్నీ వెంకట్రావుని వొకేసారి కమ్ముకున్నాయి ఏం జరుగుతుందో, ఏం చెయ్యాలో తెలియని ఆరాటం. రెండు మూడుగంటలు అటూయిటూ తిరిగాడు. చివరికి యిల్లుచేరాడు. అప్పటికి లక్ష్మి యింటికి రాలేదు.

'అసలింక లక్ష్మి తిరిగి యీ యింటికి వస్తుందా..' అనిపించింది కొన్ని క్షణాలు వెంకట్రావుకి.

రాత్రి బాగా పొద్దుపోయాక వచ్చింది లక్ష్మి యింటికి. ఆమె వచ్చిన అలికిడి విన్నాడు వెంకట్రావు. తెల్లారేక నిలేసి అన్నీ అడగాలి.. అయినా యింత మోసమా.... యింత తెరవెనుక నాటకమా... అనుకున్నాడు. మనుషులు యింతగా .. యిలా. రెండు రకాలుగా .. పూర్తి భిన్నమైన రెండు రూపాలుగా ఎలా వుండగలరో.. అని మధన పడిపోయాడు. తను అనుసరిస్తున్న అందరూ అనుసరించాలనుకుని తను నమ్ముతున్న వేల్యూ ...నిర్ద్వంద్వం.... మరింత అసహనాన్ని పెంచాయి వెంకట్రావులో.

తెల్లారిం తర్వాత లక్ష్మి ఎప్పుడు వొంటరిగాదొరుకుతుందా అనివెంకట్రావు ఎదురుచూసినట్టే, అతను ఎప్పుడు వొంటరిగా తారసపడతాడా అని లక్ష్మి ఎదురు చూస్తోంది.

పదకొండింటి ప్రాంతంలో రుక్మిణి బైటకి వెళ్ళటంతో యిద్దరికీ అవకాశం దొరికింది.

లక్ష్మి ముందు మాట్లాడింది. తనే వెంకట్రావు వున్న చోటుకి వచ్చింది.

"మీతో మాట్లాడాలనే యివాళ బైటకి వెళ్ళకుండా ఆగిపోయాను...." అంది అతనివేపే చూస్తూ....

"ఏముంది...." అంటూ ఏదో అన బోతున్న వెంకట్రావు మాటని మధ్య లోనే ఆపేసింది లక్ష్మి.

"ముందు నాకో విషయం చెప్పండి. నా గురించి అంతా రుక్మిణిగారికి చెప్పే శారా... "

"లేదు...." అన్నాడు చాలా పొడిగా వెంకట్రావు.

"అయితే ముందు నే చెప్పే నాలుగు మాటలూ వినండి. . నిన్నటి మీ పిలుపు.. ఆశ్చర్యం ... మీ చూపుని బట్టి నా గురించి మీకంతా తెలిసిపోయిందను కుంటున్నాను.... సిగ్గులేదా.... యింత మోసమా.... వొళ్ళమ్ముకోటానికి అస హ్యంగాలేదా.... ఎవరింట్లోనేనా యింత పాచిపని చేసి బతకలేవా.... అని యిలా మీరు చాలా... చాలా.... అడగొచ్చు. వీటన్నింటికీ విడివిడిగా జవాబు చెప్పే వోపక నాలో మిగల్లేదు.... అన్ని మజి లీల తర్వాతే యీ మజిలీకి వచ్చాను.... కొన్ని బాధ్యతలూ.... మరికొంత చేత కానితనం.... అన్ని రకాలుగా నలిగి నలిగి యిలా వీధులపాలయ్యాను. అలా అనినన్ను నేను సమర్థించుకోటంకాదు... నా పరిస్థితి చెపుతున్నానంతే. అసలు యిలా.... యింతగా మీతో మాట్లాడే దాన్నే కాదు.... మాట్లాడుతున్నానంటే యీ ఊరు చివర కాలనీకి వచ్చాక.... మీ ఇంటివల్ల మీ ఆవిడవల్ల నాకు మాన సికంగా కొంత తృప్తి లభించింది. దాన్ని యింత తొందరగా వొదులుకోలేని కక్కుర్తివల్ల యిలా ప్రాధేయపడు తున్నాను.

"యిదివరకు నేనున్నచోట నే నేమిటో అందరికీ తెలుసు. నాకు అక్కడ ఒక్కటే జీవితం.... ఎవరు పలక రించినా.... ఎవరు యీసడించినా వొకటే తీరు.... నన్ను కొన్నవాడికి, కొనని వాడికి.... కొనే తాహతూ, ధైర్యంలేని వాడికి అదే లోకువ.... అక్కడ ఎప్పుడూ వొంటరితనమే.... అక్కడ యిల్లు ఖాళీచేయమన్నారు.... ఆ పరిస రాల్లో అద్దె తట్టుకోలేక యింతదూరం వచ్చాను. యిక్కడ మీ యింటితోపాటు నా చిన్నతనంలో మా అమ్మా నాన్న నీడన బతికినప్పటి తృప్తి.... యింటి వాతావరణం దొరికాయి.... అందుకే ఆ తృప్తికోసమే నన్ను.... నా జీవితాన్ని దాచుకున్నాను.... మీ ఆవిడ దగ్గర ఫ్యాక్టరీ అని.... వోవర్టైమని కావా లని చాలా చాలా నా తృప్తికోసమే చెప్పాను- యిది ఎంతోకాలం దాగదు...

ఎప్పటికో అప్పటికి బైటకి పొక్కుతుంది. కాని అంతవరకేనా అది ఎంత స్వల్పకాలం అయినా యిలాగే వుండాలి వుంది ... మీ ఇంటి పరువు దెబ్బతినే పరిస్థితి వస్తే నా అంతట నేనే వెళ్ళిపోతాను.... అంతవరకూ నా జీవితాన్ని దాచి సాయం చెయ్యండి ." అంది లక్ష్మి.

వెంకట్రావు ఏం మాట్లాడలేదు.

అతని మౌనాన్ని తట్టుకోలేనిదాన్లా తిరిగి లక్ష్మే "మీతోపాటు సమానంగా కాకపోయినా హీనంగా, లోకువుగా చూడొద్దని....అనవసరమైన అక్కసుని చూపుల్లో చూపించొద్దని ఎవర్నీ బతిమాలుకోలేని బతుకు.... తిరిగి మరో యిల్లు వెతుక్కోవటం.... మరో బతుకు ఆరంభించటం... యింత తొందరగా చెయ్యాలని లేదు... కొంచెం ఆలోచించండి.... అంతగా మీకు అవసరమైతే.... మీ కోరిక తట్టుకోలేకపోతే.... మీరూ నన్ను పిలున్నప్పుడు...." అని యింక మాట పూర్తి చెయ్యలేక తలొంచుకుని నిలబడింది.

తనముందే వొంటరిగా లక్ష్మి శరీరం సిద్ధంగా వున్నా అణుమాత్రం కోరి కూడా వెంకట్రావులో కదల్లేదు తన బోటి జీవితంలోని దరిద్రమే మరో రూపంలో కళ్ళముందు ఆకారంగా నిలబడినట్టనిపించింది.

ఆ యింటి ఆధారంగా లక్ష్మి అనుభవిస్తున్న వెర్రి తృప్తికి, ఆమె శరీరం ఆధారంగా తను కోరుకున్న కక్కుర్తికి పెద్ద తేడా ఏం కనపడలేదు వెంకట్రావుకి. కనీకనిపించని అనేక రకాల వొత్తిళ్ళ అడుగున యీనాడు చాలా మందికి మిగిలినవి కక్కుర్తులే తప్ప కోరికలు కాదనిపించింది. ఆమె బతుకేమిటో స్పష్టంగా చెప్పిన లక్ష్మి చాలా నిర్ద్వందంగా కనిపించింది.

ఏదో తప్పనిసరి వెసులుబాటులా.... కొంతకాలమైనా బతకటానికి యిస్తున్న లంచంలా...అందిస్తున్న లక్ష్మి శరీరాన్ని ముట్టుకోవాలనిపించలేదు వెంకట్రావుకి.

చివరికి "రుక్మిణికి నేనేం చెప్పనులే వెళ్ళు...." అన్నాడు.

వోసారి తలెత్తి వెంకట్రావువేపు చూసి లక్ష్మి తన గదికి వెళ్ళిపోయింది. ఆ తర్వాత చాలా నెలలే ఆ యింట్లో అదే గదిలో వుండగలిగింది లక్ష్మి. మరి యీ రోజుల్లో .. అన్ని రకాలుగా మనిషి, మనసుల విలువ దిగజారిపోతున్న కాలంలో.... యిది.... లక్ష్మి కొంతకాలమైనా అలా బతగ్గలగటం....